# సభ్యతాబివ్యాం

వేమూరి సుబ్బరామశర్మ

ఆ రోజున ఎండ తీక్షణంగా ఉన్నది. కొద్ది కొద్దిగా వేడిగాలులు సాగినై. జేబుగూడా ఖాళీగాలేదు. నడక సాగటం కష్ట మనిపించింది. శరీరం వేడెక్కుతూన్నట్లనిపించి ఒక రిక్షాను సమీపించాను. ఆ రిక్షావాడు ముఖంమీదదాకా తలగుడ్డ కప్పుకుని కాళ్లను ఒక విధంగా ముడుచుకొని రిక్షాలోపల కునుకుతీస్తున్నాడు. నా అవసరం, వాడి అవసరం మనస్సులో ఉంచుకుని నెమ్మదిగా వాడిని తట్టిలేపాను. అనేకసార్లు ఆ సమయానికే వాడి బండిమీదే ఆఫీసుకు వెళ్ళటం చేత, కళ్లు నులుముకుని ఒక్కసారిగా లేచి, తలగుడ్డ సరిచేసుకుని రిక్షాకి కట్టిన మువ్వ మ్రోగించాడు. నా స్థానంలో నేను కూర్చున్నతర్వాత-వాడు ఎండలోను, నేను నీడలోను- రిక్షాకదిలింది.

నేను పనిచేసే ఆఫీసు బజారుకు మైలు, మైలున్నర దూరానికి తక్కువ ఉండదు. బజారులో వెళ్లాల్సినది మాత్రం మూడు ఫర్లాంగులే ఉంటుంది. కాని రిక్షామువ్వ ఇక్కడే ఎక్కువ సార్లు ధ్వనిచేయవలసి ఉంటుంది. ఒక మలుపు తిరిగిన తరువాత ఎత్తుపల్లాలు అంతగాలేని రోడ్డు మీద రిక్షావేగం హెచ్చింది.

రిక్షావాడు శరీరాన్ని దాచుకోలేదు. అతని నల్లని శరీరం, వంపులు తిరిగి బండబారిన కండలు, జబ్బలు మండుటెండలో కాలుతూ మెరుస్తున్నై. వేగంతోపాటు అతని వీపుమధ్యగా, రెండు పర్వత సానువులమధ్యగా పారే సెలఏరు మాదిరిగా, వెన్నుపట్టెమీదుగా ఘర్మజలం ప్రవహించి అతని బట్టను తడుపుతోంది. ఈ దృశ్యం జాలిగా, బాధాకరంగా కనిపించింది నాకు. ప్రపంచంలో శ్రమకు తగ్గ ఫలం కల్గుతోందా; మానవుడు దినదినానికి నాగరీకు డౌతున్నాడా—అనే సందేహాలు కల్గినై. ఆలోచనలలో మునిగిన నేను కొద్దిగా జేర్లబడి రిక్షాలో ఒరిగాను. ఎండతీవ్రత వల్ల కాబోలు నా కనురెప్పలు బరువై జాగ్రదవస్థ, నిద్రావస్థకాని స్థితిలోకి నన్నీడ్చినై. ఒక చిన్న కారు కనురెప్పపాటులో మమ్మ దాటి పెద్ద ధూళిని, పొగను లేపి పోయింది.

రిక్షా రెండు నిముసములాగి మరల మువ్వ మోతతో కదిలింది.

రిక్షావాడు కారు నుద్దేశించికాబోలు యిట్లన్నాడు- 'అబ్బ, ఈ కారువాళ్ళకెంత పొగరు! అసలు, యంత్రాలన్నీ ఇంతే- మనుష్యుల కళ్ళలోను, నోళ్ళలోను దుమ్ముచల్లుతై. అంతేనంటావా అశ్వమా!'

ప్రక్కకుచూడగా ఒక అశ్వశకటం రిక్షాతో పాటు నడుస్తోంది. అవధిలేని ఆశ్చర్యంతో వాళ్ళ ఇద్దరి సంభాషణ విన్నాను.

అశ్వం రిక్షావాని వంకకు తల త్రిప్పి, 'ఓహో మనుష్యుడా మాట్లాడేది. అవునవును. కార్లు, రైళ్ళు, విమానాలు వచ్చింతర్వాత అన్నింటితోపాటు గుఱ్ఱపుబండి అవసరం గూడా చాలా తగ్గిపోయిందిలే' అన్నది.

అశ్వం సకిలించింది. దానికి రిక్షావాడు కొద్దిగా నవ్వాడు. అశ్వానికి కోపం, ఉక్రోషం కల్గి, 'ఎందుకల్లా ఇకిలిస్తావ్ మానవుడా! నీ బ్రతుకు నువ్వుగూడా ఇతరులను చూసి నవ్వడమా. మీ మానవుల బుద్ధి వక్రమార్గాల్లోకి ప్రవహిస్తున్నదనడానికి నీ ఇప్పటి పరిస్థితి చాలు తార్కాణంగా' అని ఎత్తిపొడిచింది.

తెల్లబోయిన రిక్షామానవుడు, 'నా కర్థమవ లేదు నువ్వు చెప్పేది. ఏం, మానవుడు తన

మ స్తిష్క శక్తిని ధారపోసి పరిశోధించి అణు శక్తులను గూడా బట్టబయలు చెయ్యడంలేదా ?' అని అన్నాడు.

'ఓయి పిచ్చివాడా! మానవుడిని ఏవేవో చేశా వని వెనకవేసుకు వస్తున్నావు గాని నీ సంగతి నీకర్థమైందా ! ఒక వాహనాన్ని సృష్టించిన మనుష్యుడే ఇంకో మానవుడిమీద సవారీ చెయ్యడానికి దానిని ఉపయోగించడం గూడా బుద్ధి కుశలతే అంటావు కాదూ ?' అని ఎగతాళి చేసింది అశ్వం.

రిక్షావాడు ఎక్కువ కాలం ఆలోచనకు వ్యర్థం చేయకుండా, ఇట్లా అన్నాడు : 'ఐతే ఈ రిక్షా ని బజారులో ఉచితంగా, బహుమానంగా మా షావుకారుకి ఇచ్చారను కున్నావా? రెండు పచ్చనోట్లు పారవేస్తేగాని ఈ రిక్షా రాలేదు. రోజూ ఆయనకు నాకు వచ్చేదానిలో అర్థరూపాయి యిస్తూ వుంటే రెండు సంవత్సరాల తర్వాత బండి నాస్వంతం చేసేస్తాడు. డబ్బును వడ్డీకి అప్పియ్యడమన్నా ఇదైనా ఒకటే. అంతే.'

మధ్యలో అందుకుని అశ్వం 'ఇంకేం స్వంతం గూడా అవుతుందీ, చాలా బాగున్నది. శాశ్వతంగా పతనమై మానవత్వాన్నే మరచేందుకు విడిపించుకునే వీలులేని అవకాశం కల్పించాడు మీ షావుకారు! ధనం వడ్డీ కిచ్చినా కొంత సహించవచ్చు. కాని అవి నీ స్వంతమవడంలో ఎంత కుటిలత్వంతో కూడుకున్న తంత్రం ఉన్నది' అన్నది.

చిన్న బుచ్చుకున్న ముఖంతో రిక్షావాడు: 'ఎందుకలా ఎగతాళిచేస్తావ్. నాకూ ఏదో బాడుగ వస్తోంది. ఎలాగో అలాగు గడుస్తోంది.'

అశ్వం సకిలించి 'ఈ వేదాంతం నీకుకూడా అబ్బిందీ. చేతకానితనాన్ని, బీదరికాన్ని తృప్తితో ఎందుకు కప్పిపుచ్చుకుంటావ్? సిగ్గులేదా నీకు ఆమాట లనడానికి? ఎట్లాగో అట్లాగు సరి పుచ్చుకుంటున్నావా-నీ గుడిసె ప్రక్కనేగా నా యజమాని ఉన్నది; ఎన్నిసార్లు నీ భార్య పస్తులుపడుకున్నదో నాకు తెలియదను కున్నావా?'

వెలా తెలాపోయిన రిక్షావాడు డగ్గుత్తికతో 'అంతా తెలుసా నీకు!' అని మాత్రం అనగలిగాడు. అప్పటి అతని ముఖం పాషాణాలను ద్రవింపజేస్తుంది.

'అన్నీ తెలుసు. ఒక్కమాట విను. నీ రోజు ఆదాయమంతా కలిపితే నేను రెండుమార్లు రైలుస్టేషనుకు వెళ్లి తిరిగి వచ్చినందు కిచ్చే బాడుగలో సగం ఉండదు.' అన్న అశ్వం మాటలకు వాడు దీనంగా నెమ్మదిగా, 'పశువుతో కూడా సామ్యంలేదా-నాకు, ఈ మానవుడికి!'

'ఆఁ లేకేం - దేనిలోనూ సమానత్వం లేకపోయినా నీస్థితి, నాస్థితిమాత్రం సమానమే బట్టలాగడంలో...'

అశ్వం మందగమనాన్ని చూసి బండివాడు తన చర్నాకోలును విసరాడు. అది బాధతో, 'అబ్బ...ఓ మానవుడా, ఇక వెడతాను', అన్నది.

'ఒక్క సందేహం తీర్చిపో అశ్వమా,' అని జాలిచూపులు కురిపించాడు రిక్షా మానవుడు.

'కాదుకాదు-అశ్వం మనిషికన్న త్వరగా పరుగెత్తుతుంది; లేకపోతే నా యజమానిని చూశావూ - ఆ మానవుడి అభిమానానికి దెబ్బ తగులుతుంది. వెడతాను...నీ అనుమానాలు వెనుక వచ్చే వృషభం తీరుస్తుందిలే,' అని గంభీరంగా సకిలించి టకటకమంటూ అశ్వశకటం పరుగుతీసింది.

అశకటం అట్లా పోవడం, ఒక వృషభ శకటం దానిస్థానే తయారవటం ఒక్కసారిగా జరిగినై. ఇదంతా ఏకో చిత్రంగా స్వప్న సీమల్లో విహరిస్తూన్నట్లున్నది నాకు. రిక్షావాని లోని మానవత్వాన్ని మేలుకొలిపేందుకు వృషభం ఏంమాట్లాడుతుందో అని ఆశ్చర్యంతో, శ్రద్ధతో వాళ్ల సంభాషణ విన్నాను.

రిక్షావాడు, 'ఏం వృషభమా! నా అనుమానాలు తీర్చవూ?' అని ప్రశ్నార్థకంగా ప్రక్కకు చూశాడు. వృషభం మాట్లాలేదు.

'ఏం మాట్లావేం? నీకు మాటలురావూ?' అని నాలుగైదు మార్లు అరచిన తర్వాత 'ఛీ!' అని మాత్రం నిరసనగా విదిలించింది.

'ఎందుకట్లా అసహ్యించుకుంటున్నావూ?'— అన్న వాడిమాటల్లో అశ్వంవలెనే పరిహాసం చేస్తుందనే భయం లేకపోలేదు.

వృషభం బుసకొట్టి, ముట్టెను ఇటూ అంటూ కదిలించి, అసహ్యంకాక మరేమివుండాలి మీమీద! మానవుల మనస్సు మీదనేకాకుండా, మాంసంమీదగూడా అధికారం చలాయించటం నీగ్రోబానిసలవ్యాపారాన్ని గుర్తుకు తెస్తోంది. ఏదో-"

మధ్యలో అందుకుని కొద్దిగా వికసించిన ముఖంతో రిక్షావాడు, "ఆఁ, నా అనుమానం సరీగా అక్కడే—నాగరకత, ప్రజాస్వామ్యం, సామ్యవాదం- ఇవన్నీ నిజంగా ప్రపంచంలో అమలు జరుగుతున్నాయా?"

మానవుడిని ఎగతాళిచేయడానికి అదను దొరకిందనే సంతోషంతో కాబోలు వృషభం మెడను కదిలించగా గంటలు మ్రోగినై. ఇట్లా జవాబు చెప్పింది- "ఓయి అమాయకుడా! ఆ మాటలన్నీ, వినడానికి మకరందాన్ని మరిపిస్తై. అంతే అవి అధికారంలోకి వచ్చేందుకు ఒక మానవుడు ప్రజలమీద వెదజల్లే మత్తుమంత్రాలు; పడక కుర్చీలో రాజకీయ శాస్త్రజ్ఞులు అనుభవించే పగటికలలు. ఈ విషయాల్లో ఊహకీ వాస్తవికానికీ మధ్యనున్నదూరం ఇంతా అంతా కాదు. ఆ పదాలను అడ్డంగా పెట్టుకుని ఎంత ద్రోహం జరుగుతోందో తెలుసా! ధనికుడు ఇంకా ఇంకా ఐశ్వర్యవంతుడౌతున్నాడు; పేదవాడు ఇంకా ఇంకా నిరుపేదగా తయారై శల్యావశిష్టుడౌతున్నాడు."

రిక్షావాని ముఖంలో ఆశారేఖలు మెరిసినై; విషాదపు చీకటులు విడిపోతున్నై. అతడు "ఐతే మరి దీనికి నివారణోపాయం ఏమీలేదా" అని ప్రశ్నార్థకంగా అన్నాడు. తన అనుమానం పూర్తిగా తీరుతుందనే ఉత్సాహంతో.

"అన్నింటి విషయం నేను చెప్పలేను; కాని నీ అవస్థకు ఒకటే ఉపాయం. అది ప్రభుత్వం రిక్షాలను బహిష్కరించటమే. ఐతే నీజీవనం ఎట్లాగడుస్తుందని నీ సందేహం. దానికి ప్రభుత్వమే త్రోవ చూపాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు.' అని వృషభం చెప్పే సంగతిని రిక్షావాడు శ్రద్ధతో విని ఇంకేం ప్రశ్నించడానికి బుద్ధిపుట్టక ఈ మాటలు మాత్రం అన్నాడు: 'అబ్బ, నీకెన్ని విషయాలు తెలుసు. అశ్వంకంటే తెలివిగల దానివల్లే ఉన్నావే!'

'నీకు తెలియని సంగతులన్నీ వింతగానే కనిపిస్తాయి. సరే, నే వెడతాను. ఎక్కువసేపు మాట్లాడితే మీ మనుష్యులకు అనుమానాలు అధికమౌతై...ఐనా ఇంత నెమ్మదిగా నీతో నడచే అలవాటుకూడా లేదు. వెడతాను,' అని వృషభం వేగంగా నడక సాగించింది.

రిక్షావాడుకూడా వేగం హెచ్చించి, 'మళ్లీ జన్మలో తప్పకుండా నువ్వు మానవుడివై పుట్టు వృషభమా,' అని దీవన పూర్వకంగా అన్నాడు చివర మాటలుగా.

వేగం తగ్గించి వృషభం కంగారుగా, 'వద్దు వద్దు; మానవజన్మ ఎంత విషాదభరితమో అర్థమైంది. రిక్షావాడుగానే జన్మిస్తే అది విషాదతమమైన స్థితే ఔతుంది. ఇంకనేమీ మాట్లాడకు. వెనుక మహిషం వస్తుంది. నీకు సరియైన స్నేహితుడు దొరుకుతాడులే.' అని ఎగతాళిగా గంటలు మ్రోగించుతూ రిక్షా వానిని దాటిపోయింది.

రిక్షా మానవునిగుండె దిగజారి పోయిందనే అనుకున్నాను. వాడు ఒక్కసారిగా పెద్ద నిట్టూర్పుతో 'లేదులేదు, నేను భరించలేను. నా మానవత్వం ఎంత దెబ్బతిన్నదో నా కర్థమైనదిప్పుడు. మహిషంతోకూడా పోల్చుకొని ఇంకా ఇంకా కుమిలిపోలేను.' అని పెద్దపెద్ద అంగలేస్తూ పరుగులెడుతున్నాడు. అతగాడి వేగానికి నా శరీరం బాగా కుదిలి, కదిలించినట్లయింది. నేనప్పటిదాకా చూస్తున్నదృశ్యం, వింటూన్న మాటలు అంతకంతకు దూరమై అదృశ్యమైనై.

'అయ్యగారూ, దిగండి బాబూ' అంటూన్న రిక్షావాడి కేకలు నన్ను పూర్తిగా జాగ్రదవస్థలోకి తీసికొనివచ్చినై. కళ్ళు నులుముకుంటూ ఆశ్చర్యంతో కంగారుగా లేచి నిలబడ్డాను. నా చేయి జేబులోనికిపోయి ఒక పావలాను వాడికిచ్చింది; నా కాళ్ళు మేడమెట్లు నెక్కి ఆఫీసులోనికి దారి తీసినై.